క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఆర్మూర్‌టౌన్‌: వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్‌ అన్నారు. అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌, కాలేజీ హాస్టల్‌ను వైద్యాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ రమేష్‌ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ఒత్తిడి నియంత్రణ (స్ట్రెస్‌ మేనేజ్‌మెంట్‌) విధానాలపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం పాఠశాలలోని హాస్టల్‌ వంటశాలలను పరిశీలించి, పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణమూర్తి, ఆరోగ్య విస్తీర్ణాధికారి స్వామి, స్కూల్‌ ప్రిన్సిపల్‌ లత, హెల్త్‌ అసిస్టెంట్‌ బట్టు ఆనంద్‌, హెచ్‌ఏ రాణి,కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రంలో వీధులకు నంబర్లు కేటాయిస్తూ.. సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఆనంద్‌నరేష్‌కు సోమవారం ముప్కాల్‌ పరిరక్షణ సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో వీధులకు నంబర్లు లేక పోవడంతో సరైన అడ్రస్‌ తెలియక చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే నంబర్లు కేటాయించి సూచిక బోర్డులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ముప్కాల్‌ పరిరక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంతంలో మరుగుదొడ్ల నిర్మాణం



నవీపేట : మండలంలోని నాళేశ్వర్‌ గ్రామంలో రాజరాజేశ్వర ఆలయ ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థం అదే గ్రామానికి చెందిన ఉప్పల రమేష్‌ రూ.3 లక్షల వ్యయంతో మరుగుదొడ్లను నిర్మించారు. సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు ఈ మరుగు దొడ్ల తాళాలు అప్పగించారు. ఈ సందర్భంగా ఉప్పల రమేష్‌ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు గంగవ్వ, లింగన్నల జ్ఞాపకార్థం ఈ నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బినోల సొసైటీ చైర్మన్‌ ముగ్గారి హన్మాండ్లు, మాజీ సర్పంచులు ద్యాగ సరీన్‌, నర్సింగ్‌ రావు, వీడీసీ ప్రతినిధులు లక్ష్మణ్‌, రాము, భీమ్‌ రెడ్డి, శ్యామ్‌, రాకేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో సంఘానికి నష్టం



మాట్లాడుతున్న సోమ శేఖర్‌రావు

కోటగిరి (రుద్రూర్‌): ప్రస్తుత పాలకవర్గం అనాలోచిత నిర్ణయాలు, సంఘ సిబ్బంది నిర్లక్ష్యంతో ఎత్తొండ సింగిల్‌ విండో నష్టాల బారిన పడిందని మాజీ విండో చైర్మన్‌ సోమశేఖర్‌ రావు ఆరోపించారు. కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపులో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘం నష్టానికి కారకులైన వారి నుంచి నిధుల రికవరి చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రత్యర్థుల అవినీతి బయటపడుతుందనే భయంతో తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంఘ అధ్యక్షుడిగా 1995 నుంచి 2018 వరకు కొనసాగి విండోను రూ.2.3 కోట్ల టర్నోవర్‌ నుంచి రూ. వంద కోట్ల టర్నోవర్‌కు తీసుకువచ్చానని వెల్లడించారు. సంఘ అభివృద్ధిని, వ్యక్తిగత ఎదుగుదలను ఓర్వలేక పలువురు ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 23ఏళ్ల పదవీ కాలాన్ని సంఘ అభివృద్ధి కోసం వినియోగించానని ఆయన స్పష్టం చేశారు. ఈసమావేశంలో మాజీ సర్పంచ్‌ హన్మంత్‌ రావు దేశాయ్‌, గంగారాం, నారాయణ, దశరథ్‌ తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీలు వితరణ

వేల్పూర్‌: మండలం లక్కోర ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఆర్మూర్‌ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం ఇంగ్లీషు, తెలుగు డిక్షనరీలు వితరణ చేశారు. విద్యార్థులు డిక్షనరీలు ఉపయోగించుకొని ఆంగ్లంలో ప్రావీణ్యం పెంచుకోవాలని హెచ్‌ఎం, ఎంఈవో రేణుక సూచించారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్‌, సభ్యులు తిరుపతి, శ్రీధర్‌, విజయానంద్‌, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పెర్కిట్‌(ఆర్మూర్‌): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్మూర్‌ కోర్టు జూనియర్‌ సివిల్‌ జడ్జి వేముల దీప్తి అన్నారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో శ్రావణ్‌ గార్డెన్‌ ఫంక్షన్‌ హాల్‌లో సోమవారం నిర్వహించిన శ్రీ చంద్ర హైస్కూల్‌ వార్షికోత్సవ వేడుకల్లో జూనియర్‌ సివిల్‌ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.

తగ్గిన ఇసుక ధర

- నియోజకవర్గం దాటి మరో చోటుకు తరలిపోకుండా చర్యలు
- ఇసుక అక్రమ రవాణాకు చెక్‌ పెట్టడంపై హర్షం
- ధరల నియంత్రణతో ఇళ్లను నిర్మించుకునేవారికి లబ్ధి

మోర్తాడ్‌: బాల్కొండ నియోజకవర్గంలో ఇళ్లు నిర్మించుకునేవారికి శుభవార్త లభించింది. ఇసుక అక్రమ రవాణాకు చెక్‌ పెట్టడంతో పాటు వ్యాపారుల ఆగడాలను కట్టడి చేయడంతో ఇసుక ధరలు సగానికి దిగివచ్చాయి. మోర్తాడ్‌ మండలంలోని సుంకెట్‌ వాగు నుంచి ఇసుకను తరలించడానికి అనుమతులు ఇవ్వగా ఆ గ్రామానికి చెందిన వ్యాపారులే ఇసుకను తరలించడానికి ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకునేవారు. ఒక్కో ట్రాక్టర్‌ లోడ్‌కు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేసేవారు. సుంకెట్‌ వ్యాపారులు ఇసుక ధరను తగ్గించకపోవడంతో ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్‌ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అధికారులతో మాట్లాడి ఏర్గట్ల మండలం బట్టాపూర్‌ క్వారీని తెరిపించారు. దీంతో



కమ్మర్‌పల్లిలో ఇంటి ముందు పోసిన ఇసుక కుప్పలు

ఇక్కడి నుంచి మోర్తాడ్‌, కమ్మర్‌పల్లి, వేల్పూర్‌ మండలాల్లోని పలు గ్రామాలకు ఇసుక రవాణా సాగుతుంది. బట్టాపూర్‌ నుంచి గ్రామాల దూరాన్ని బట్టి ఇసుక ధరను రూ.2,800ల నుంచి రూ.3,300ల వరకు నిర్ణయించారు. ఎక్కువ ధరకు ఇసుకను విక్రయించకుండా చర్యలు చేపట్టారు. ఇసుకను తరలించే ట్రాక్టర్లకు అద్దె, కూలీలకు కూలి సొమ్ము, గ్రామాభివృద్ధి కమిటీకి విరాళంను పోను ఇసుకను తరలించేవారికి రూ.500ల లోపు లాభం ఉండేలా ధర నిర్ణయించడం విశేషం. గతంలో కంటే సగానికి సగం ధర తగ్గిపోవడంతో అనేక మందికి ఇసుక చౌకగా లభిస్తోంది. ధరను నియంత్రించడంతో ఇళ్లు నిర్మించుకునేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎక్కువ ధరకు కొనుగోలు చేశాం



ఇసుకను గతంలో ఒక్కో ట్రిప్పుకు రూ.5వేలు చెల్లించి కొనుగోలు చేశాం.ఇప్పుడు రూ.3 వేలకే ధర తగ్గింది. మధ్య తరగతి వారికి తక్కువ ధరకే ఇసుక లభించడం సంతోషంగా ఉంది.

– గగ్లోత్‌ అనిల్‌, నాగాపూర్‌

నిర్మాణ భారం తగ్గుతుంది



ఇసుకను చౌకగా సరఫరా చేయడంతో ఇళ్లు నిర్మించుకునే వారికి ఖర్చులు తగ్గుతాయి. ఇసుకను కొనుగోలు చేయడానికి గతంలో రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చు చేశాం. ఇప్పుడు సగం ధర తగ్గిపోవడంతో నిర్మాణ భారం తగ్గుతోంది.

– బండి మహేష్‌, ఏర్గట్ల

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

బట్టాపూర్‌ శివారులోని వాగు నుంచి ఇసుకను తరలించడానికి నిబంధనల ప్రకారమే అనుమతులు ఇస్తున్నాం. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమంగా రవాణా జరుగకూడదనే ఉద్దేశ్యంతో ఇంటిని నిర్మించుకునేవారికే అనుమతులను జారీ చేస్తున్నాం. అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్‌ చేస్తున్నాం.

– శ్రీలత, తహసీల్దార్‌, ఏర్గట్ల

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ అంకిత్‌

బాల్కొండ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్‌ అంకిత్‌ అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో చేసిన వంటలను పరిశీలించారు. కిచెన్‌ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వంట పాత్రలను శుభ్రంగా కడిగిన తరువాతనే వంట చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట తహసీల్దార్‌ శ్రీధర్‌, ఎస్‌వో భవాని, ఉపాధ్యాయులు తదితరులున్నారు.
మోర్తాడ్‌: కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఎల్‌పీవో, మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ సూచించారు. సోమవారం ఏర్గట్ల కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. ఫిర్యాదుల బాక్సును పరిశీలించారు. విద్యార్థులతో వసతులు, భోజనం ఇతర అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట ఎంపీవో శివచరణ్‌, కస్తూర్బా ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న ఆదర్శ రైతు చిన్నికృష్ణుడు

బోధన్‌: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్‌ రైతు వేదికలో రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిజామాబాద్‌, డిచ్‌పల్లి ప్రాంతాలకు చెందిన ఆదర్శ రైతులు చిన్ని కృష్ణుడు, గంగాధర్‌ తమ అనుభవాలను వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సందేహాలను నివృత్తి చేశారు. ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులతో కలిగే ప్రయోజనాలను శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డీనేటర్‌ అంజయ్య, శాస్త్రవేత్తలు స్వప్న, రాజ్‌కుమార్‌, శ్వేత, విజయ్‌కుమార్‌, ఏఈవో ఉమా, రైతులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం పాట

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని ఎక్సైజ్‌ స్టేషన్‌లో మంగళవారం వివిధ కేసులో పట్టుబడిన వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవేన్‌ సన్‌ సోమవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 11గంటలకు ఎక్సైజ్‌ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

ఇసుక అక్రమాలపై చర్చలకు సిద్ధమే



ఏర్గట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ పార్టీ నాయకులు

మోర్తాడ్‌: నియోజకవర్గంలో గతంలో జరిగిన ఇసుక అక్రమ దందాపై ఇప్పుడు సాగుతున్న వ్యాపారంపై చర్చకు సిద్ధమని కాంగ్రెస్‌ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం ఏర్గట్ల మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్‌, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు సోమ దేవారెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్‌లు విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ హయాంలో పదిమంది నాయకులే అంతా తామై ఇసుక వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. తాము అన్ని రకాలుగా చర్చకు సిద్ధమని బీఆర్‌ఎస్‌ నాయకులు తేదీ, వేదికను వెల్లడించాలని స్పష్టం చేశారు. చర్చలకు సిద్ధం కాకపోతే ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌ చేశారు.

విద్యార్థులకు ఓపెన్‌ హౌజ్‌



ఫైర్‌ ఇంజిన్‌ గురించి వివరిస్తున్న సిబ్బంది

బాల్కొండ : మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక పోలీస్‌, ఫైర్‌ స్టేషన్లలో ఓపెన్‌ హౌజ్‌ నిర్వహించారు. ఫైర్‌ స్టేషన్‌ లో ఫైర్‌ ఇంజిన్‌ గురించి వివరించారు. దీంతో విద్యార్థులకు పాలన పరమైన అంశాలపై అవగాహన కలుగుతుందని ప్రిన్సిపల్‌ చందన అన్నారు.

కొంగు బంగారంగా 'రాజరాజేశ్వరుడు'



ఆలయ గర్భ గుడిలో లింగం



గార్డెన్‌లో ఆకట్టుకుంటున్న శివుని విగ్రహం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం కొత్తపల్లి గ్రామంలో వెలిసిన శ్రీరాజరాజేశ్వరుడు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి. గ్రామంలో వెలిసినప్పటి నుంచి భక్తులకు కొంగు బంగారంగా విరజిల్లుతూ పూజలందుకుంటున్నాడు. ఈఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏడాది శివరాత్రి ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం కలశ స్థాపన, గణపతి హోమం, మండపారాధనలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గతంలో పురాతన చిన్న ఆలయం ఉండేది. ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామస్తులు ఐక్యంగా ఏర్పడి నూతన మందిరాన్ని నిర్మించారు. ప్రతి సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తారు. చాలా మంది భక్తులు ఇంటి దైవంగా కొలిచి మొక్కులు తీర్చుకుంటారు.

ప్రత్యేక ఆకర్షణగా గార్డెన్‌..

శివాలయం దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా గార్డెన్‌ నిలుస్తోంది. భక్తులు గార్డెన్‌లో సేదతీరుతారు.ఈగార్డెన్‌లో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం ఆకట్టుకుంటోంది. శ్రీశైలం మల్లికార్జున్‌ స్వామి వద్ద ఏర్పాటు చేసిన విధంగా కొత్తపల్లిలోనూ ఏర్పాటు చేశారు.

శివ దీక్షలు..

ఆలయం వద్ద శివరాత్రికి 41 వ రోజు ముందు నుంచే సందడి నెలకొంటుంది. గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల నుంచి వచ్చి భక్తులు శివ దీక్షలు చేపడుతారు. 41 రోజులు నిత్య అభిషేకం, భజన, కీర్తనలు ఉంటాయి.

ఆధ్యాత్మికం

శివాలయంలో ప్రత్యేక పూజలు



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో భక్తులు రద్దీ నెలకొంది. స్వామివారికి పంచామృతలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు రామాలయం, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్థంభం వద్ద గల హనుమాన్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజ్‌ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతో అన్నదాన ప్రసాదం స్వీకరించారు. అలాగే మంగళవారం శివపార్వతీ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్‌, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, నరేష్‌, రామాగౌడ్‌, సిద్ధుల గుట్ట సేవా సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథం ఊరేగింపు

మోర్తాడ్‌: మండలంలోని గాండ్లపేట్‌ గ్రామస్తులు శివాలయం కోసం తయారు చేయించిన రథంను కమ్మర్‌పల్లి నుంచి ఆలయం వరకు సోమవారం



శివాలయ రథంను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఊరేగింపుగా తీసుకవచ్చారు. శివాలయం వద్ద శివరాత్రి రోజు ఉత్సవ విగ్రహాలను ఊరేగించడానికి రూ.6లక్షల వ్యయంతో రథంను కొత్తగా తయారు చేయించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మామిడి కాశన్న, దైడి జైరాజు, చౌలమద్ది గంగన్న,ఒల్లెపు వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ముప్కాల్‌లో పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌, ముప్కాల్‌ మండల కేంద్రంలో పడిలేచిన మర్రిచెట్టు వద్ద,మండలంలోని కొత్తపల్లిలో రాజరాజేశ్వరఆలయంలో,మెండోరా మండలం బుస్సాపూర్‌,వెల్కటూర్‌,పోచంపాడ్‌ శివాలయాల్లో సోమవారం మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

కేదారీశ్వర ఆశ్రమంలో కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు



శివలింగానికి జలాభిషేకం చేస్తున్న మంగిరాములు

నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రానికి సమీపంలోని శ్రీకేదారీశ్వర ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మట్టితో తయారు చేసిన ప్రత్యేక శివలింగానికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఆశ్రమ కమిటీ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ సమక్షంలో వేద పండితుల బృందంచే లక్షా పదాహారు రుద్రాక్షలతో లింగానికి అర్చన అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆనంద రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

వేల్పూర్‌: మండలంలోని అక్లూర్‌ గ్రామంలో శ్రీ ఆనంద రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ విష్ణుసేవానందగిరిస్వామి ఆధ్వర్యంలో మహాగణపతిపూజ, హోమం, నివేదన, హారతి, పూజకార్యక్రమాలు నిర్వహించారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరానే లక్ష్యం



నూతన లైన్‌ ప్రారంభిస్తున్న విద్యుత్‌ అధికారులు

బోధన్‌రూరల్‌ : వినియోగదారులకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్‌ సరఫరానే లక్ష్యమని ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్‌ అన్నారు. వేసవిలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగకుండా సమ్మర్‌ యాక్షన్‌లో భాగంగా సోమవారం పట్టణ పరిధిలో మూడు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్లనువిద్యుత్‌ సరఫరా లైన్‌లకు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఎండీ ముక్తార్‌ మాట్లాడుతూ వేసవిలో లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్‌ లైన్‌ అనుసంధానం చేస్తున్నామన్నారు. వినియోగదారులు విద్యుత్‌ను అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలన్నారు. డివిజన్‌ పరిధిలో ఇటీవల కాలంలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురవడంతో విద్యుత్‌ సరఫరాలో సమస్యలు వస్తున్నాయన్నారు. రైతులు తమ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై నిఘా ఉంచాలని ఆయన సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీస్‌, విద్యుత్‌ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఏడీఈ నగేష్‌ కుమార్‌, ఏఈ కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ అంతరాయం కలగకుండా వీసీబీ ఏర్పాటు

రుద్రూర్‌: వేసవిలో నిరంతరాయ విద్యుత్‌ సరఫరాకు పొతంగల్‌ మండలం హెగ్డోలి, కల్లూర్‌ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌లలో వ్యాక్యూమ్‌ సర్క్యూట్‌ బ్రేకర్‌ను సోమవారం అమర్చారు. దీంతో విద్యుత్‌ అంతరాయం తగ్గుతుందని విద్యుత్‌ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డివిజనల్‌ ఇంజనీర్‌ ముక్తార్‌ అహ్మద్‌, అసిస్టెంట్‌ డివిజన్‌ ఇంజనీర్‌ నగేష్‌, ఇన్‌చార్జి ఏఈ ఫక్రుద్దీన్‌ ఖాద్రీ, విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మహిళ సాధికారత కేంద్రం నిపుణురాలు కవిత

రుద్రూర్‌: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళ సాధికారత కేంద్రం నిపుణురాలు కవిత అన్నారు. కోటగిరి కేజీబీవీ స్కూల్‌లో సోమవారం బేటీ పడావో..బేటీ బచావో కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహలతో కలిగే అనర్థాలు వివరించారు. బాలికలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలల పరిరక్షణ విభాగం జిల్లా కోఆర్డినేటర్‌ సాయిలు, కేజీబీవీ స్పెషల్‌ ఆఫీసర్‌ సవితా రాణి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్‌



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (ఆర్మూర్‌)

- స్క్రీన్‌-1 – ది డెవిల్స్‌ చైర్‌(తెలుగు)-10.40, రామం రాఘవం(తెలుగు)-1.55, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-4.30, 7.20, 10.10
- స్క్రీన్‌-2 – రిటర్న్‌ ఆఫ్‌ది డ్రాగన్‌(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20, బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్‌-3– జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-10.10, రిటర్న్‌ ఆఫ్‌ది డ్రాగన్‌(తెలుగు)-1.00, ఛావా(హిందీ)-4.10, బాపు(తెలుగు)-7.30, తండేల్‌(తెలుగు)-10.05
- స్క్రీన్‌-4 బాపు(తెలుగు)-10.30, తండేల్‌ (తెలుగు)-1.05, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-4.10, ఛావా (తెలుగు) - 7.10, 10.30

ఉషా ప్రసాద్‌ మల్టీప్లెక్స్‌ (గీతా ఏషియన్‌)

- స్క్రీన్‌-1 జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30 రిటర్న్‌ ఆఫ్‌ది డ్రాగన్‌-4.30, 10.20
- స్క్రీన్‌-2 ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20
- స్క్రీన్‌-3 తండేల్‌(తెలుగు)-1.45, 4.40, 7.30 బాపు(తెలుగు)-10.30

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (వేణు మాల్‌)

- స్క్రీన్‌-1 రిటర్న్‌ ఆఫ్‌ది డ్రాగన్‌(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20 బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్‌-2 ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40 రిటర్న్‌ ఆఫ్‌ది డ్రాగన్‌(తెలుగు)-1.20 జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30
- స్క్రీన్‌-3 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30 ఛావా(హిందీ)-1.20 తండేల్‌(తెలుగు)-4.40, 10.20 బాపు(తెలుగు)-7.45
- స్క్రీన్‌ -4 ది డెవిల్స్‌ చైర్‌(తెలుగు)-11.30 రామం రాఘవం(తెలుగు)-1.45 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-7.40 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40

లలితామహల్‌ తండేల్‌(తెలుగు)

దేవి జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15 రిటర్న్‌ ఆఫ్‌ది డ్రాగన్‌(తెలుగు)-2.15, 9.15

నటరాజ్‌ ఛావా(హిందీ)

విజయ్‌ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్‌	89,700	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్‌	82,710		

– నిజామాబాద్‌ బిజినెస్‌

మాంసం ధరలు

చికెన్‌	ధరలు (కిలోకు)	డ్రెస్డ్‌	160
		లైవ్‌	100
స్కిన్‌లెస్‌	180	మటన్‌	800

సంక్షిప్తం

కాలనీ కమిటీ నూతన కార్యవర్గం

పెర్కిట్‌(ఆర్మూర్‌): మున్సిపల్‌ పరిధిలో పెర్కిట్‌లో మహాలక్ష్మీ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ కమిటీ అధ్యక్షుడిగా బాలేరావు గణేష్‌ రావు, ఉపాధ్యక్షుడిగా ఇందూర్‌ విజయ్‌ కుమార్‌, కోశాధికారిగా కిషన్‌, కార్యదర్శిగా నవీన్‌, సంయుక్త కార్యదర్శిగా సాయిరాం, దయాకర్‌, శ్రీనివాస్‌ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శివరాత్రి వేడుకలకు ఈరవత్రి అనిల్‌కు ఆహ్వానం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌ శివాలయ కమిటీ సభ్యులు సోమవారం శివరాత్రి వేడుకల్లో పాల్గొనాలని టీఎస్‌ ఎండీసీ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ను ఆహ్వానించారు. ఈమేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో రాజలింగం, కపిల్‌, ప్రసాద్‌, హనుమంతు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు

బోధన్‌: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఒత్తిళ్లకు గురికావొద్దని ఎంఈవో నాగయ్య సూచించారు. సోమవారం సాలూర మండలంలోని కల్దుర్కి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. ఉపాధ్యాయులు రవి,నగేష్‌, వీడీసీ చైర్మన్‌ గంగాధర్‌ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు అక్రమం

ఆర్మూర్‌టౌన్‌: జిల్లాలో సీఎం రేవంత్‌ రెడ్డి పర్యటన సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులను అరెస్టు చేయడం అక్రమమని ఆర్మూర్‌ ఏరియా ఉపాధ్యక్షుడు వినోద్‌ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ ఆర్మూర్‌ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు నాయకులు నవదీప్‌, సాయి, నితిన్‌ పాల్గొన్నారు.

తడిపొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని 14వ వార్డులో మహిళలకు తడి పొడి చెత్తపై సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ గజానంద్‌ అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేరు చేసి చెత్త వాహనాలకు అందించాలని సూచించారు. పర్యావరణ ఇంజినీర్‌ పూర్ణిమా ళి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఆట పాటలు

మాక్లూర్‌: మండలంలోని దాస్‌నగర్‌ శివారులో గల శ్రీచంద్రా టెక్నో పాఠశాల 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీసీపీ బస్వారెడ్డి గౌరవ అతిథిగా ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల నాట్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మాక్లూర్‌: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జిల్లాలో జోరుగా కొనసాగుతోంది. మండలంలోని మాణిక్‌భండార్‌లో సోమవారం కాంగ్రెస్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు పురుషోత్తం ప్రచారం చేశారు. నాయకులు టీఎస్‌రెడ్డి, సికిందర్‌, భాషా, గుండ్ల స్వామి, విండో వైస్‌ చైర్మన్‌ గుండారం శేఖర్‌, ఆలూర్‌ లింగం ఉన్నారు.

సీఎం సమావేశానికి తరలిన కాంగ్రెస్‌ శ్రేణులు

నందిపేట్‌(ఆర్మూర్‌): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌ నగరానికి రావడంతో సోమవారం మండలం నుంచి కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు, పట్టభద్రులు తరలి వెళ్లారు. ప్రైవేట్‌ ఉపాధ్యాయులు, పట్టభద్రులు కాంగ్రెస్‌ పార్టీ నాయకులు కలిసి బస్సుల్లో వెళ్లారు.